క్లుప్తంగా

ఐఎంఏ భవనానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే నానికి వినతి పత్రం అందిస్తున్న ఐఎంఏ వైద్యులు

ఏలూరు టౌన్‌: ఏలూరు నగరం, జిల్లా వ్యాప్తంగా ప్రజలకు విశేష సేవలు అందిస్తోన్న వైద్యులకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు నగరంలో ఐఎంఏ భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. స్థల కేటాయింపునకు కృషి చేస్తానని నాని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఐఎంఏ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆళ్ళనానికి వినతి పత్రం అందజేశారు. ఐఎంఏ ఏలూరు శాఖ అధ్యక్షుడు సదాశివరావు, కృష్ణప్రసాద్‌, విజయభాస్కరరెడ్డి, బసవరాజు, రమేష్‌, చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక నిఘా



ఏలూరు టౌన్‌ : ఏలూరు త్రీటౌన్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా కోమాకుల శివాజీ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఎస్పీ ఇ.శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. శివాజీ 1996 ఎస్సై బ్యాచ్‌లో ఏలూరు జిల్లా దెందులూరులో తొలుత విధుల్లో చేరారు. ఆయన అనంతపల్లి, పాలకొల్లు టౌన్‌, తణుకు రూరల్‌ తదితర ప్రాంతాల్లో ఎస్సైగా, ఏలూరు సీసీఎస్‌ స్టేషన్‌, గుడివాడ-2, కింకిపాడు, విజయవాడ సైబర్‌ క్రైమ్‌, గన్నవరం తదితర ప్రాంతాల్లో సీగా పనిచేశారు. మచిలీపట్నం డీసీఆర్‌బీ సీఐగా విధులు నిర్వర్తిస్తూ ఏలూరు త్రీటౌన్‌కు బదిలీపై వచ్చారు. నేరాల నిరోధానికి తమవంతు కృషి చేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని శివాజీ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని సూచించారు. త్రీటౌన్‌ సీఐగా బాధ్యతలు చేపట్టిన కోమాకుల శివాజీ ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నేరాలను అదుపునకు కృషి చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరిస్తూ విధులను నిర్వర్తించాలని నాని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

- పార్టీ సీనియర్‌ నాయకుడు బలరాం
- 2406 దరఖాస్తులకు 2396 సర్టిఫికెట్ల అందజేత



ఏలూరు వన్‌టౌన్‌ జగనన్న సురక్షలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నేత బలరాం, వేదికపై ఇడా చైర్‌పర్సన్‌ ఈశ్వరి, తదితరులు

ఏలూరు టౌన్‌: ప్రజలకు మేలు చేయాలనే కాంక్షతోనే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని వైఎస్సార్‌సీపీ ఏలూరు సీనియర్‌ నాయకులు మధ్యాహ్నపు బలరాం అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని గాంధీ జ్ఞానమందిరంలో శనివారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏలూరు నగరంలో ఐదు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా విభజించి జగనన్న సురక్ష శిబిరాలను ఏర్పాటుచేసి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను అందజేస్తున్నట్టు చెప్పారు. ఇడా చైర్‌పర్సన్‌ మధ్యాహ్నపు ఈశ్వరి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ పాము పద్మ, పార్టీ నాయకులు పాము శామ్యూల్‌, నండూరి వేణుగోపాల్‌, హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మాలతీ, తదితరులు ఉన్నారు. జగనన్న సురక్ష క్లస్టర్‌ ఇన్‌చార్జి-1 మోటమర్రి సదానందం, నగర కమిషనర్‌ సంక్రాంతి వెంకటకృష్ణ, నగరపాలక సంస్థ విప్‌ పైడి భీమేశ్వరరావు హాజరయ్యారు.

జగనన్న సురక్షలో ఇలా :

ఆముదాల అప్పలస్వామి కాలనీ, పడమరవీధి 1, 2 కోటదిబ్బ, కెనాల్‌రోడ్డు సచివాలయాల క్లస్టర్‌లో వేలాది మందికి ధ్రువ పత్రాలు అందజేశారు.

దరఖాస్తులు	2406
మంజూరయిన సర్టిఫికెట్లు	2396
కుల ధ్రువ పత్రాలు	1717
ఆదాయ ధ్రువ పత్రాలు	603
ఆధార్‌ అప్‌డేట్స్‌	43
రైస్‌ కార్డు మార్పులు, చేర్పులు	07



జాలిపూడిలో ప్రజలకు ధ్రువ పత్రాలు అందించిన అధికారులు

జగనన్న సురక్షపై హర్షం

ఏలూరు రూరల్‌ : ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకు చేర్చడమే జగనన్న సురక్ష ప్రధాన లక్ష్యమని ఏలూరు మండల ప్రత్యేక అధికారి, డీఆర్వో ఏవీఎస్‌ఎస్‌ మూర్తి అన్నారు. శనివారం ఏలూరు మండలం జాలిపూడిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ధ్రువ పత్రాలు అందిస్తామన్నారు. తహసీల్దార్‌ బి.సోమశేఖర్‌ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు గ్రామాల్లో ప్రజల వద్దకే చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. కార్యక్రమానికి సర్పంచ్‌ వీది నవ్య అధ్యక్షత వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి, ఏఓ జీవనసంధ్య తదితరులు పాల్గొన్నారు.

'లయన్స్‌ సేవలు విస్తృతం చేస్తాం'



ప్రమాణ స్వీకారం సందర్భంగా మాట్లాడుతున్న ఎడ్వర్డ్‌

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్‌ క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి పేద ప్రజలకు అండగా నిలుస్తామని ఏలూరు సెంట్రల్‌ లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్‌ అన్నారు. శనివారం రాత్రి స్థానిక హనుమాన్‌ నగర్‌లోని లయన్స్‌ ఏలూరు విజన్‌ కార్యాలయంలో ఏలూరు సెంట్రల్‌ లయన్స్‌ క్లబ్‌, ఏలూరు ప్లాటినం పెరల్స్‌ లయన్స్‌ క్లబ్‌ల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్‌ మాట్లాడుతూ అంతర్జాతీయంగా లయన్స్‌ క్లబ్‌లు సేవా కార్యక్రమాలతో సమాజానికి చేదోడువాదోడుగా నిలుస్తోందని, ఈ ఏడాది సామాజిక మార్పు అనే నినాదంతో సేవా కార్యక్రమాలు కొనసాగించడానికి తగిన కార్యాచరణతో ముందుకు వెళతామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాస్ట్‌ జిల్లా గవర్నర్‌ కేవీ కిషోర్‌ కుమార్‌ రెండు క్లబ్‌లకు నూతనంగా ఎన్నికైన ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సెంట్రల్‌ లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడిగా తోట ఎడ్వర్డ్‌, ఉపాధ్యక్షులుగా బి.రాజు, తాన్యా రాజ్‌ చుక్కా, కార్యదర్శిగా టి.రవికుమార్‌, కోశాధికారిగా పి.గోపాల కృష్ణ, ప్లాటినం పెరల్స్‌ క్లబ్‌ అధ్యక్షులుగా ఎం.పద్మజ, ఉపాధ్యక్షులుగా డి.ఫాతిమ, పొట్లూరి అనురాధ, సర్వీస్‌ చైర్‌పర్సన్‌గా బాడిత పార్వతి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ల ప్రతినిధులు ఎ.శేషు కుమార్‌, నిర్మల ఇంటి, టి.శిరీష లక్ష్మి, అడపా రాఘవరావు, టి.రవి కుమార్‌, పి.గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌ సీఐగా రాజశేఖర్‌



ఏలూరు టౌన్‌: ఏలూరు వన్‌టౌన్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌.రాజశేఖర్‌ నియమితులయ్యారు. శనివారం సాయంత్రం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 1998 బ్యాచ్‌ ఎస్సైగా పోలీస్‌ శాఖలో చేరారు. ఏలూరు రేంజ్‌ పరిధిలో అనేక పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా విధులు నిర్వహించారు. 12 ఏళ్ల క్రితం ఆయన సీఐగా పదోన్నతి పొందారు. తాడేపల్లిగూడెం, ఏలూరు వన్‌టౌన్‌, హనుమాన్‌ జంక్షన్‌, ఏలూరు త్రీటౌన్‌, విజయవాడ సిటీ ట్రాఫిక్‌, మచిలీపట్నం చిలకలపల్లి స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై ఏలూరు వన్‌టౌన్‌ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ మాట్లాడుతూ గతంలో ఏలూరు నగరంలో పనిచేసిన అనుభవం ఉందని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. రాత్రి, పగలు నేరస్తులపై నిఘా, గస్తీ ముమ్మరం చేస్తామన్నారు. గంజాయి రవాణా, విక్రయాలు, మత్తుపదార్థాల వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వలంటీర్ల సేవలపై సంతృప్తి

వలంటీర్లకు వందనం

కరోనాపై పోరులో ధీరత్వం

ఏలూరు టౌన్‌: స్వచ్ఛంద సేవకులు వలంటీర్‌ వ్యవస్థపై ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీతనంగా ఉండాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే వలంటీర్‌ వ్యవస్థకు రూపకల్పన చేసి అమల్లోకి తెచ్చారు. ప్రపంచ దేశాలన్నీ కరోనా మహమ్మారిని ఎదుర్కోవటంలో అత్యంత దయనీయస్థితిని ఎదుర్కొంటే ఏపీ రాష్ట్రంలో మాత్రం వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు అండగా నిలిచారు. కుటుంబాలు, తల్లిదండ్రులు, బంధువులను సైతం పక్కనబెట్టి ప్రమాదమని, ప్రాణాలతో చెలగాటమని తెలిసీ కరోనాతో పోరాటం చేశారు. ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఔషధాలు ఇంటికీ వెళ్లి మరీ అందజేశారు. ఫీవర్‌ సర్వే, హోమ్‌ క్వారంటైన్‌, హాస్పిటల్స్‌కు బాధితుల తరలింపు, కరోనా బాధితుల గుర్తింపు ఇలా ఒక్కటేమిటీ ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించారు. కరోనా అనంతరం ప్రతి ఇంటికీ పెన్షన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలను చేరువచేయటం, ఇళ్ల పట్టాలు అందజేయటం, లబ్ధిదారుల మ్యాపింగ్‌ వంటి అనేక సేవలను అందిస్తూ ప్రజలకు ఇంటివద్దకే పాలన తెచ్చారు.

కరోనాలోనూ పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్‌ ఇస్తున్న వలంటీర్‌ నాగదుర్గ (ఫైల్‌)

ఏలూరు 35వ డివిజన్‌లోని వీరేశలింగం వీధిలో వృద్ధురాలు కొచ్చర్ల చిట్టెమ్మ అనారోగ్యంతో మంచం పట్టింది. ఆమెకు ఇంటికెళ్లి మంచంపై ఉండగానే పింఛన్‌ పంపిణీ చేసింది వలంటీర్‌ అనపాల నాగదుర్గ. తమ పరిధిలోని 50 కుటుంబాలకు అండగా ఉంటూ ఉత్తమ సేవలు అందించింది. కరోనా కష్టకాలంలోనూ అన్ని సౌకర్యాలను చేరువచేసిన వలంటీర్ల సేవలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

కరోనా బాధితుల గుర్తింపు



కొత్తపేటలో కరోనా సమయంలో హోమ్‌ క్వారంటైన్‌ బాధితులను పరామర్శిస్తున్న వలంటీర్లు (ఫైల్‌)

ఏలూరు టూటౌన్‌ ప్రాంతంలో ప్రజలకు కరోనా కష్టకాలంలో ప్రతి ఇంటికీ వెళుతూ కరోనా బాధితులను గుర్తించి, వారిని హాస్పిటల్స్‌కు తరలించటంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరించారు. ప్రాణాలకు తెగించి ప్రజలకు అండగా నిలిచారు. ఆరోగ్య పరిస్థితిని నిత్యం గమనిస్తూ ఏదైనా ఇబ్బంది కరమైన పరిస్థితి ఉంటే వెంటనే హాస్పిటల్స్‌కు తరలించేలా వలంటీర్లు వెంకటేష్‌, నాగరాజు తదితరులు విశేష కృషి చేశారు.

సంక్షేమ సారథులుగా..



ఎన్‌ఆర్‌పేటలో ఇంటిపట్టా అందిజేస్తున్న వలంటీర్‌ సరిత (ఫైల్‌)

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయటంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఏలూరు 26వ డివిజన్‌ నరసింహారావు పేటలోని సాలసాక్షి లక్ష్మమ్మకు ఇల్లు లేకపోవటంతో వలంటీర్‌ పిల్లి సరిత దరఖాస్తు చేసింది. ప్రభుత్వం అన్ని అర్హతలు పరిశీలించి ఆమెకు ఇంటి స్థలం మంజూరు చేసింది. ఇంటి పట్టాను వలంటీర్‌ లబ్ధిదారునికి అందజేయటంతో ఆమె సంతోషానికి అవధులులేవు.

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ



కొత్తపేటలో ఫీవర్‌ సర్వే చేస్తున్న వలంటీర్‌, ఆరోగ్య కార్యకర్త

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కరోనా సమయంలోనే కాకుండా, వర్షాకాలం, శీతాకాలంలోనూ ఫీవర్‌ సర్వే చేపడుతూ ప్రజల ఆరోగ్యస్థితిని తెలుసుకుంటున్నారు. అనారోగ్యానికి గురైన వారికి వైద్య సేవలు అందించేలా ఆశాలు, ఏఎన్‌ఎం లతో కలిసి సేవలు అందిస్తున్నారు. ఏలూరు వన్‌టౌన్‌లో ఇంటింటికీ వెళ్లి ఫీవర్‌ సర్వే చేస్తున్నారు వలంటీర్‌ విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	100	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	90	బీట్‌రూట్‌	40
కాకర కాయలు	54	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్‌	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	188-260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్‌	40	పాలకూర	12
దొండకాయలు	22	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-34	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్‌	96
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	22

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	15
ఏలూరు -ఈసీఐఎల్‌	22.30	4814	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌	22.15	34820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

సామాజిక మార్పు నినాదంతో సేవలు



లయన్స్‌ జిల్లా గవర్నర్‌ మాణిక్యాలరావును సత్కరిస్తున్న లయన్స్‌ క్లబ్‌ల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్‌ ఇంటర్నేషనల్‌ సంస్థ అధ్యక్షురాలు పట్టి హిల్‌ పిలుపు మేరకు ఈ ఏడాదిని లయన్స్‌ క్లబ్‌ ద్వారా సామాజిక మార్పు నినాదంతో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు లయన్స్‌ జిల్లా గవర్నర్‌ గట్టిం మాణిక్యాలరావు తెలిపారు. ఆయన అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన అంతర్జాతీయ కన్వెన్షన్‌లో పాల్గొని జిల్లా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి శనివారం ఏలూరు నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరు గ్రీన్‌ సిటీలోని లయన్స్‌ భవనంలో స్వాగత సమావేశం ఏర్పాటుచేశారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ డాక్టర్‌ పట్టి హిల్‌ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల గవర్నర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారని చెప్పారు. లయన్స్‌ క్లబ్‌ పట్ల విశ్వాసం పెరిగేటట్లు ప్రతి సభ్యుడు సేవలందించాలని కోరారు. జిల్లా ప్రథమ, ద్వితీయ వైస్‌ గవర్నర్లు కాకరాల వేణు బాబు, ఎన్‌వీవీఎస్‌ పాపారావు నాయుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం లయనిజాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌ పూర్వపు జిల్లా గవర్నర్లు వేమా కోటేశ్వరరావు, కేవీ కిషోర్‌ కుమార్‌, జిల్లా కేబినెట్‌ సెక్రెటరీలు ఎన్‌.నాగమల్లేశ్వరరావు, కొమ్ముల మురళీకృష్ణ, కోశాధికారి వి.రామకృష్ణారావు, జిల్లా గాట్‌ నాయకులు వి.సత్యస్వరూప్‌, కొరిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

వన్‌టౌన్‌ స్టేషన్‌లో డీఐజీ తనిఖీ



వన్‌టౌన్‌ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్‌, చిత్రంలో ఎస్పీ మేరీ ప్రశాంతి, డీఎస్పీ, సీఐ

ఏలూరు టౌన్‌ : ఏలూరు వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ను ఏలూరు రేంజ్‌ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ ఎస్పీ డి.మేరీ ప్రశాంతితో కలిసి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. వన్‌టౌన్‌ సర్కిల్‌ స్టేషన్‌ రికార్డులను పరిశీలించారు. సీఐ బోణం ఆదిప్రసాద్‌, ఎస్సైలు ఎస్‌.రామకృష్ణ, బాషా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వన్‌టౌన్‌ సర్కిల్‌ పరిధిలో కేసుల నమోదు, పరిష్కారం, చార్జిషీట్లు, న్యాయస్థానాల్లో నిందితులకు శిక్షలు వంటి అంశాలపై ఆరా తీశారు. సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్‌టౌన్‌ స్టేషన్‌ సిబ్బందిని పిలిచి డీఐజీ ప్రత్యేకంగా మాట్లాడారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దని డీఐజీ అశోక్‌కుమార్‌ సూచించారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఉన్నారు.

ఉచిత న్యాయ సలహా, సేవలు పొందండి



సదస్సులో మాట్లాడుతున్న మేరీగ్రేస్‌కుమారి

ఏలూరు రూరల్‌ : ప్రభుత్వ, ప్రైవేటు సేవల్లో లోపం జరిగినప్పుడు శాశ్వత లోక్‌ అదాలత్‌ ద్వారా న్యాయం పొందవచ్చని శాశ్వత లోక్‌ అదాలత్‌ చైర్‌ పర్సన్‌ ఎ.మేరీగ్రేస్‌కుమారి అన్నారు. శనివారం ఏలూరు 49 డివిజన్‌ సచివాలయంలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. రవాణా, పోస్టల్‌, ఇన్సూరెన్స్‌, వైద్య, విద్య, బ్యాంకింగ్‌, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌, హౌసింగ్‌ తదితర రంగాల్లో సేవలు పొందే సమయంలో లోపం జరిగినప్పుడు శాశ్వత లోక్‌ అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అర్హత ఉన్న ముద్దాయిలకు డిఫెన్స్‌ కౌన్సిల్‌ ద్వారా ఉచితంగా కేసులు వాదిస్తామని చెప్పారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాసరావు, సోషల్‌ వర్కర్‌ మేతర అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చెరకు మద్దతు ధర రూ.5 వేలకు పెంచాలి

ఏలూరు రూరల్‌: కేంద్ర ప్రభుత్వం టన్ను చెరకు రూ.5 వేలు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ డిమాండ్‌ చేశారు. శనివారం స్థానిక అన్నె భవన్‌లో నిర్వహించిన రైతు సంఘం సమావేశ వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల కేంద్రం 2023-24 ఏడాదికి టన్ను చెరకు మద్దతు ధర రూ.3,150గా ప్రకటించిందన్నారు. సీఏసీపీ సిఫార్సు ఆధారంగా మద్దతు ధర నిర్ణయించామని వెల్లడించడం అసత్యమని ఆరోపించారు. సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్‌ మాట్లాడుతూ వ్యవసాయ కమిషన్‌ సూచనల మేరకు సాగు ఖర్చులు లెక్కించి 50 శాతం అధనంగా ధర నిర్ణయించాలని కోరారు.

భూమి కేటాయింపుపై హర్షం

దెందులూరు: ప్రతి గ్రామంలో శ్మశానాలకు ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుని ఆమోదించడం గొప్ప సంస్కరణ అని, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరి హక్కును, భద్రతను కాపాడే గొప్ప సంస్కరణవాది అని వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్‌, ఎంఆర్‌పీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్‌, పార్టీ మండల నేత నిట్టా గంగరాజు అన్నారు. శనివారం జోగన్నపాలెంల నేతలు మాట్లాడుతూ శ్మశానాలకు ప్రభుత్వం భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతించారు. అన్ని గ్రామాల్లో, అన్ని కులాల శ్మశానాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం దేశానికే ఆదర్శప్రాయమన్నారు. శ్మశానాల స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కులాల తరపున శ్మశానాలకు స్థలాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తేరా ఆనంద్‌, శేఖర్‌, గంగరాజు హర్షం వ్యక్తం చేశారు.